

సుదర్శన హోమానికి రూ.లక్ష

నఖనేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి నూలి భాస్కర్, కుటుంబ సభ్యులు (పాలకొల్లు) ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్న దానానికి కొంపెల్ల అలివేలు (రాజమహేంద్రవరం) రూ.1.00.116, లక్ష్మింశెట్టి వెంకటేశ్వరరావు (తాటి పాక) రూ.50 వేల చొప్పున అందజేశారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహర్ మంగళవారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.44
కాకినాడ	6.24	4.42
అమలాపురం	6.24	4.42

గీత దాటేదే లే..

- పిఠాపురం, గొల్లప్రోలుల్లో అవిశ్వాసానికి కుట్ర
- బలం లేకపోయినా కుతంత్రాలు
- ప్రలోభాలకు లొంగని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- జనసేన నేతలకు చుక్కెదురు



పిఠాపురం మున్సిపల్ కార్యాలయం

పిఠాపురం: తుని మున్సిపాలిటీలో చేయాల్సిన అక్రమాలు, అరాచకాలన్నీ చేసి, చివరకు కేసులు కూడా పెట్టి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కూటమి నేతలు వేధించిన విషయం తెలిసిందే. ఇదే బాటలో ఇప్పుడు అదే కూటమి లోని జనసేన నేతలు పిఠాపురం, గొల్లప్రోలుపై కుట్రకు తెర తీశారు. అయితే, వారి ప్రయత్నాలను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆదిలోనే అడ్డుకున్నారు. డబ్బు, పలుకుబడి, అధికారం, ప్రలోభాలు, పైరవీలు.. ఇలా ఒకటీ రెండూ కాదు.. అస్త్రాలన్నీ ప్రయోగించినా.. ఉన్న అడ్డదారులన్నీ తొక్కినా.. తాము వైఎస్సార్ సీపీ 'గీత' దాటేదే లేదని ఆ పార్టీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. తాము వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించేది లేదని, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత మాట జవదాటేది లేదని రెండు పట్టణాల్లోనూ ఆ పార్టీ కౌన్సిలర్లు స్పష్టంగా చెబుతున్నారు. దీంతో, అడ్డదారిలో పురపాలన పగ్గాలు చేజిక్కించుకునేందుకు కుట్రలు పన్నిన జనసేన నేతలకు ఆదిలోనే చుక్కెదురైంది.

ఏం జరిగిందంటే..

పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంది. అడ్డగోలు హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి, గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కూటమి నేతలు.. ముఖ్యంగా జనసేన నాయకులు ఈ రెండు పట్టణాలపై కన్ను వేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభపెట్టి, అవసరమైతే భయపెట్టి అడ్డదారిలో పురపాలనాధికారం దక్కించుకోవాలనే కుట్రకు తెర తీశారు. ఈ నేపథ్యంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు ఈ నెల 21 నుంచి ప్రయత్నాలు ప్రారంభించారు.

బలాబలాలివీ..

- పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లకు గాను గతంలో ఒకరు మృతి చెందారు. దీంతో ఇక్కడ ప్రస్తుతం 29 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరు కాకుండా స్థానిక ఎమ్మెల్యే అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా పిఠాపురంలోనే ఓటు వేసే అవకాశాలున్నాయి. ఈ లెక్కన ఓటింగ్‌కు మొత్తం 32 మంది సభ్యులు ఉన్నారు. గత ఎన్నికల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నుంచి గండేపల్లి సూర్యావతి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమెపై అవిశ్వాసం పెట్టాలంటే మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేయాలి. అంటే కనీసం 22 మంది సంతకాలు అవసరం. ప్రస్తుతం కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీకి 18 మంది, జనసేనకు తాజాగా చేరిన ఆరుగురు కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో ఓట్లతో కలిపి 9 మంది ఉన్నారు. టీడీపీకి చెందిన ఒక సభ్యుడు చనిపోగా.. ఆ పార్టీకి 5 ఓట్లు ఉన్నాయి.
- గొల్లప్రోలు నగర పంచాయతీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో వైఎస్సార్ సీపీకి ఏకంగా 19 మంది సభ్యుల బలం ఉంది. టీడీపీకి ఒక సభ్యుడే ఉన్నాడు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఇటీవల కొంత మంది వైఎస్సార్ సీపీ నేతలు జనసేనలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గొల్లప్రోలు నుంచి ఒక్క కౌన్సిలర్ కూడా జనసేనలో చేరలేదు. ఒక కో ఆప్షన్ సభ్యుడు వెళ్లినా ఆయనకు ఓటు హక్కు లేదు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఈ నగర పంచాయతీ చైర్‌పర్సన్ పదవి కూడా జనరల్ మహిళకు రిజర్వ్ చేశారు. ప్రస్తుతం గండేటి మంగతాయారు చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమెపై అవిశ్వాసం పెట్టాలంటే 14 మంది సభ్యులు అవసరం. ప్రస్తుత తరుణంలో అది జరిగే పని కాదు.

బెడిసికొట్టిన జనసేన యత్నాలు

పిఠాపురంలో అవిశ్వాసానికి 22 మంది కౌన్సిలర్ల సంతకాలు కావాలి. జనసేన, టీడీపీ కౌన్సిలర్లను కలిపినా ఆ సంఖ్య 14 దాటడం లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నుంచి మరో ఆరుగురిని తమ పార్టీలో చేర్చుకోవాలని జనసేన నేతలు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కొంత మంది నాయకులు, కౌన్సిలర్లు ఇప్పటికే రహస్య సమావేశాలు జరిపినా చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎవ్వరూ ముందుకు రాలేదని తెలుస్తోంది. దీంతో పాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తమ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిలబడటంతో జనసేన నేతలు దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. అధికార జులుం, తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి, నయానో భయానో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను లొంగదీసుకునేందుకు వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎలాగైనా ఈ రెండు మున్సిపాలిటీలనూ తమ వశం చేసుకునేందుకు, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు జనసేన నాయకులు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పిలిచి టికెట్టు ఇచ్చి, తమను కౌన్సిలర్లను చేసిన తల్లిలాంటి పార్టీని, ప్రతి విషయంలో తమకు అండగా ఉంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత మాటను దాటి మరో పార్టీలోకి వెళ్లేది లేదంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. అధికారం ఉన్నా విశ్వాసాన్ని కొనలేరని ఆ పార్టీ నేతలు మరోసారి నిరూపించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

విద్యారంగ సమస్యలపై రోడ్ మ్యాప్

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే బకాయిలు చెల్లించాలి
- ఆర్థిక సమస్యలు తక్షణం పరిష్కరించాలి
- యూటీఎఫ్ డిమాండ్
- రాజమహేంద్రవరంలో పోరుబాట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు. వేదికపై యూటీఎఫ్ నేతలు

రాజమహేంద్రవరం సిటీ: విద్యారంగంలో పేరుకుపోతున్న ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తలపెట్టిన పోరుబాటలో భాగంగా రాజమహేంద్రవరంలోని శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.30 వేల కోట్లు బకాయిల చెల్లింపులపై సరైన శ్రద్ధ చూపించడం లేదని అన్నారు. 29 శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్సీ వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటన ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్సీ ఎరియర్లు, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఎప్పటిలోగా చెల్లిస్తారో రోడ్ మ్యాప్ తెలియజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరుబాట ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు.

ప్రభుత్వ స్కూళ్ల ఉనికికి ముప్పు


యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉనికి కోల్పోతున్నాయన్నారు. భవిష్యత్తులో మోడల్ పాఠశాలల పేరుతో గ్రామాల్లోని చాలా పాఠశాలలను ఎత్తివేసే యోచనతో ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాల్లో కామన్ పాఠశాలలు ఉండాలని, విద్యా రంగానికి జీడీపీలో 6 శాతం నిధులు ఖర్చు చేయాలని ఎన్నో సూచనలు చేసిన కొఠారి కమిషన్ నివేదికను ప్రభుత్వాలు ఆచరించటం లేదన్నారు. ఊరి బడిని బతికించుకోవటానికి ఉపాధ్యాయులంతా నడుం కట్టాలన్నారు. అందుకోసం పిల్లలు, పిల్లల తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. నూతన విద్యావిధానం-2020 అమలు చేస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని తుంగలోకి తొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. విద్యారంగ ప్రయోజనాలతో కాకుండా పాలకవర్గ ప్రయోజనాలతో ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని, అందుకే ప్రభుత్వ విద్యారంగం వెనుకబడుతోందని అన్నారు. విద్యారంగానికి నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వ ఉదాశీన వైఖరి ఇలాగే ఉంటే భవిష్యత్తులో వేలాది ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా విధానానికి పాలకులు పెద్దపీట వేయాలన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే ఉపాధ్యాయుల హక్కుల సాధన జరుగుతుందన్నారు. టీచర్లు మార్కిస్టు, కమ్యూనిస్టు భావాలతో ఉన్నప్పుడు మాత్రమే నూతన మానవుల్ని, నూతన సమాజాన్ని తయారు చేయగలరన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కులాలు, మతాలు, వర్గాలు, ఆర్థిక ప్రలోభాలు ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తోటకూర చక్రవర్తి, అరుణకుమారి, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఐదు జిల్లాల్లోని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా, రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోరుబాట సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు

న్యూస్‌రీల్

డెల్టాలకు 10,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులకు చేరింది.

రత్నగిరిపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 1,600 వ్రతాల నిర్వహణ
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామి వారిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని ఆదివారం 40 వేల మంది దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు 1,600 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి, టేకు రథంపై వేంచేయించారు. పూజల అనంతరం పండితులు రథ సేవ ప్రారంభించారు. ఆలయ ప్రాకారంలో రథంపై మూడుసార్లు సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు ధరించి (ముత్తంగి సేవ) భక్తులకు దర్శనమివ్వనున్నారు.



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

జల్సాల కోసం బైకుల చోరీలు



నిందితులు, వారు చోరీ చేసిన బైక్‌లతో పోలీసులు

- నిందితుల అరెస్టు
- 31 వాహనాల స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చెడు వ్యసనాలు, జల్సాల కోసం ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న నిందితులను ప్రకాష్ నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, సీఐ బాజీలాల్, ఎస్సై శివప్రసాద్ ఈ వివరాలు తెలిపారు. నల్లజర్ల మండలం మర్లపూడి గ్రామానికి చెందిన తూర్ల సోమయ్య ప్రస్తుతం రాజమహేంద్రవరం మంగళవారపేటలో నివాసం ఉంటున్నాడు. అతడు చెడు వ్యసనాలు, తిరుగుళ్లకు బానిసయ్యాడు. తన జల్సాలకు అవసరమైన డబ్బుల కోసం బైకులు దొంగతనం చేసేవాడు. అలా దొంగిలించిన బైకులను నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన చీర్ల కిషోర్ ద్వారా తక్కువ ధరకే విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. రాజమహేంద్రవరంలో ఇటీవల బైకు దొంగతనాలు ఎక్కువగా జరుగుతూండటంతో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న తూర్ల సోమయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా బైకు చోరీల చిట్టా బయట పడింది. దొంగిలించిన బైకులు విక్రయించడానికి సహకారం అందించిన చీర్ల కిషోర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం, కోరుకొండ, ఏలూరు, విజయవాడ ప్రాంతాల్లో నిందితుడు చోరీ చేసిన 31 బైకులు రికవరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.16 లక్షలుంటుందని సీఐ బాజీలాల్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్, ఎస్సై శివప్రసాద్, క్రైమ్ కానిస్టేబుళ్లు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబు, వి.శివప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు. ద్విచక్ర వాహదారులు తమ బైకుల రక్షణకు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ రమేష్‌బాబు కోరారు. హ్యాండిల్ లాక్‌తో పాటు, ఫోర్క్ లాక్ ఉపయోగిస్తే బైకు దొంగతనాలను కొంతమేరకు అరికట్టవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అధునాతన తాళాలు వచ్చాయని, వాటిని ఉపయోగించడం ద్వారా బైకులకు మరింత రక్షణ లభిస్తుందని తెలిపారు.

వర్గీకరణ బిల్లును వెంటనే విరమించుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ఆమోదించడంపై ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ బిల్లును విరమించుకునేంత వరకూ, చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దె దింపేంత వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ సమితి ఆధ్వర్యాన స్థానిక మోరంపూడి జంక్షన్‌లో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మోరంపూడి జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు ఇసకపట్ల రాంబాబు, పరమట గణేశ్వరరావు, చీరా రాజు, ఆరే చిన్ని, ఎలుగొండ లక్ష్మి (చెల్లాయమ్మ) మాట్లాడుతూ, రాజ్యాంగ విరుద్ధంగా, సహజ సూత్రాలకు వ్యతిరేకంగా ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లును విరమించుకోకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి రాజ్యాధికారం సాధించకుండా చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమన్నారు. వర్గీకరణ పేరుతో రాజకీయ పబ్బం గడుపుకొంటున్న చంద్రబాబు.. మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా ఎస్సీ వర్గీకరణ చేయడం లేదని, దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పార్టీని ప్రశ్నించగలరా అని నిలదీశారు. కులగణన చేసిన తరువాతే వర్గీకరణ జోలికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. మంద కృష్ణ మాదిగ చెప్పిన కాకి లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయడాన్ని తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మాలల విశ్వరూపం చూపించి, చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

నిర్మలగిరి.. భక్తజన ఝరి

- కిటకిటలాడిన మేరీ మాత పుణ్యక్షేత్రం
- ప్రత్యేక వాహనాలపై తరలి వచ్చిన భక్తులు



దివ్యబలి పూజకు హాజరైన భక్తులు



అఖండ దేవాలయంలో దివ్యబలి పూజ సమర్పిస్తున్న రెవరెండ్ ఫాదర్ ప్రసాద్, ఫాదర్లు

దేవరపల్లి: గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీ మాత మహోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఆదివారం భక్తజన ప్రవాహం పోటెత్తింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు బస్సులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో తరలి వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, తమ కోర్కెలను మరియతల్లికి విన్నవించుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ కుటుంబ సమేతంగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. పలువురు భక్తులు సుమారు 200 మీటర్ల ఎత్తయిన కొండ పైన ఉన్న క్రీస్తు ఆలయానికి మెట్ల దారిలో మోకాళ్లపై ఎక్కి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ మెట్ల దారిపై ఈ ఏడాది రేకుల పందిరి వేశారు. పుణ్యక్షేత్రం ప్రధాన ద్వారం వద్ద ఉన్న మరియతల్లి మండపం వద్ద భక్తులు ఆ తల్లి స్వరూపం వద్ద మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనల ద్వారా తమ కోర్కెలు విన్నవించుకుంటున్నారు. మతాలకు అతీతంగా ప్రజలు మేరీ మాత ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. కొబ్బరి కాయలు కొట్టడం, తలనీలాలు సమర్పించడం పుణ్యక్షేత్రంలో ప్రత్యేకత. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్లలో భక్తులు విశ్రాంతి తీసుకుంటున్నారు.

మార్మోగుతున్న క్రీస్తు ఆరాధన

క్రీస్తు ఆరాధనతో పుణ్యక్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 25న పీఠాధిపతులు దివ్యబలి పూజ సమర్పణతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. నవదిన జపాలు, దివ్యబలి పూజలు, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు, పరిశుద్ధ జపమాల వంటి దైవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తోలిక పాలనాధికారి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జయరావు పొలిమెర పర్యవేక్షణలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఎస్.జాన్‌పీటర్ ఆధ్వర్యాన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పుణ్యక్షేత్రంలో ఆదివారం నల్గొండ పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ కరణం ధమస్ కుమార్, వికార జనరల్ పి.బాల, రెవరెండ్ ఫాదర్ డి.ఆరోన్, జి.మోజెస్ దివ్యబలి పూజ, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు, పరిశుద్ధ జపమాల, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతులు, ఫాదర్లు ప్రార్థనలు చేసి భక్తులను ఆశీర్వదించారు.



మరియతల్లి స్వరూపం వద్ద భక్తుల ప్రార్థనలు



కొండపై క్రీస్తు ఆలయానికి మోకాళ్లపై వెళుతున్న భక్తులు

పెరిగిన రద్దీ

సాయంత్రం 6 గంటల నుంచి పుణ్యక్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. ఉత్సవాలకు నాలుగు రోజుల్లో సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. పుణ్యక్షేత్రం ఏర్పడి దాదాపు 40 ఏళ్లు కాగా, అఖండ దేవాలయ ప్రతిష్ఠాపన జరిగి 25 ఏళ్లవడంతో, ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకూ తరలివస్తున్న భక్తులతో పుణ్యక్షేత్రం కిటకిటలాడుతోంది. వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసు సిబ్బందితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అధికారులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యాన దేవరపల్లి సీఐ బీఎస్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

మేరీమాత ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. గుండుగొలను - కొవ్వూరు పాత జాతీయ రహదారికి ఇరువైపులా పుణ్యక్షేత్రం ఉండడంతో ఈ నెల 25వ తేదీ వరకూ ట్రాఫిక్‌ను హైవే మీదుగా మళ్లించారు. కొవ్వూరు వైపు వెళ్లే భారీ వాహనాలు, క్వారీ లారీలను దేవరపల్లి, దుద్దుకూరు వద్ద.. దేవరపల్లి, జంగారెడ్డిగూడెం వైపు వెళ్లే వాహనాలను గౌరీపట్నం, పంగిడి వద్ద జాతీయ రహదారి వైపు మళ్లించినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు యథాతథంగా తిరుగుతాయని చెప్పారు.



నిర్మలగిరి పుణ్యక్షేత్రం వైపు సాగుతున్న భక్తజన ప్రవాహం

క్లుప్తంగా

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత సత్యనారాయణ

నల్లజర్ల:మండలం దూబచర్లలో వైఎస్సార్ వసంత్‌నగర్ కాలనీలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించి రెండుపోర్షన్ల షెడ్డు అగ్నికి ఆహుతి అయ్యింది. సుంకర నన్యానమ్మ ఆదివారం ఉదయం టీకాచుకునేందుకు గ్యాస్ స్టౌ వెలిగించగా గ్యాస్ లీకై వ్యాపించిన మంటలలో ఇంటి సామగ్రి అంతా కాలి బూడిదైంది. ఆమె దాచుకున్న రూ.15 వేలు కళ్లముందే కాలిపోయాయి. పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న పగటి వేషాలు వేసే భైరవపాటి వెంకటేశ్వరావుకు చెందిన సౌండ్ సిస్టమ్, హార్మోనియం, తబలా, మేకప్ దుస్తులు, రూ.25 వేల నగదు కాలి బూడిదయ్యాయి. మొత్తం రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు అంచనావేశారు. భీమడోలు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పంది సత్యనారాయణ, స్థానిక నాయకుడు చేబ్రోలు బాలాజీ తదితరులు పరామర్శించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

ఇనుపగొట్టం పడి జట్టు కూలీ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

అంబాజీపేట: జీవనోపాధి కోసం కూలి పనికి వెళ్లిన వ్యక్తి తలపై ఇనుప గొట్టం పడడంతో అతడు మృత్యువాత పడ్డాడు. పనికి వెళ్లి వస్తానని చెప్పి ఉదయమే వెళ్లిన కొద్ది గంటల్లోనే అతడు మృతి చెందాడన్న విషయం తెలియడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరైంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిరతపూడి గ్రామానికి చెందిన దారపురెడ్డి శ్రీనివాసు (పండు) (25) ఆదివారం అమలాపురంలో ఓ భవన నిర్మాణానికి జట్టు కూలీలతో కాంక్రీటు శ్లాబు కొట్టే పనికి వెళ్లి వెళ్లాడు. అక్కడ పనులు చేస్తున్న సమయంలో పై అంతస్తు నుంచి ఓ ఇనుప గొట్టం శ్రీనివాస్ తలపై పడింది. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. 108 వాహనంలో అతనిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో తల్లిదండ్రులు లక్ష్మణస్వామి, ధనలక్ష్మితో పాటు భార్య దుర్గ, కుమార్తె లహరి, కుమారుడు విశ్వాస్, బంధువులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.



పోటీలను ప్రారంభిస్తున్న చందలాడ అనంత పద్మనాభం



సీనియర్స్ ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప



జూనియర్స్ ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు

విజేత కోనసీమ వృషభం

- ఉత్కంఠగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు
- జూనియర్ విభాగంలో విజేత సామర్లకోట

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. కేవలం సెకండ్ల వ్యత్యాసంలో ఎడ్లు విజేతలుగా నిలిచి యజమానికి గర్వకారణంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పోటీలను తిలకించి మాట్లాడుతూ గతంలో ఎంత పశు సంపద ఉంటే అంత గొప్పవారిగా పరిగణించే వారని పేర్కొన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏరువాక సాగడానికి కొందరు రైతులు ఎడ్లను పెంచుతూ ఇటువంటి పోటీలకు రావడం హర్షణీయమన్నారు. ఎడ్ల పరుగు పోటీల్లో పాల్గొనే రైతులే నిర్వాహకులుగా శ్రీకుమారా రామ భీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్‌గా ఏర్పాటు చేయడం ఆయనపై ఉన్న గౌరవ చాటిచెప్తొందని అన్నారు. ఈ పోటీలను మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం ప్రారంభించారు.



రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు

సీనియర్ విభాగంలో

ఉమ్మడి జిల్లాలైన తూర్పు, పశ్చిమ, నెల్లూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాలకు చెందిన 12 జతల ఎడ్లు, జూనియర్ విభాగంలో 31 జతల ఎడ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పరుగు పందెంలో కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో అనకాపల్లికి జిల్లా అర్జునగిరికి చెందిన పరవన్నాయుడు ఎడ్లు, మూడో స్థానంలో మళ్లీ శృతిచౌదరి ఎడ్లు నిలిచాయి. వారికి వరుసగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, నిర్వాహకుడు కంటే ఫణికుమార్, వుండవిల్లి వీరవెంకటరామరాజు బహుమతులను అందజేశారు. మొదటిస్థానంలో నిలచిన ఎడ్లు నిర్ణీత దూరాన్ని ఐదు నిమిషాల 24 సెకండ్ల 93 మిల్లీ సెకండ్లలో, రెండో స్థానంలో నిలచిన ఎడ్లు ఐదు నిమిషాల 31 సెకండ్ల 16 మిల్లీ సెకెండ్లలో, మూడో స్థానంలో నిలచిన ఎడ్లు ఐదు నిమిషాల 34 సెకండ్ల 81 మిల్లీ సెకెండ్లలో విజేతలుగా నిలిచాయి.

జూనియర్ విభాగంలో

ప్రథమ విజేతగా సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్రకుమార్ ఎడ్లు, ద్వితీయ విజేత వడిశిలేకుకు చెందిన ధరణి శ్రీనివాసు ఎడ్లు, తృతీయ విజేత గాడాలకు చెందిన మద్దాల శ్రీను ఎడ్లు, నాలుగో బహుమతిగా వెల్దుర్తికి చెందిన మొగిలి ఏసుబాబు ఎడ్లు, ఐదవ బహుమతిగా మళ్లీ సత్యేంద్రకుమార్ ఎడ్లు బహుమతులు గెలుచుకున్నాయి. వీరికి రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు బహుమతులు అందజేశారు.

ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సిద్దా నానాజీ, యనమల కృష్ణ, చేకూరి రామకృష్ణ వ్యవహరించగా, నిర్వాహకులు వల్లూరి దొరబాబు, బిక్కిన రంగ నాయకులు, వుండవిల్లి వీరవెంకటరామరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు గోలి వెంకట అప్పారావుచౌదరి, యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘ నాయకుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు, నిమ్మకాయల రంగనాగ్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగిన ప్రదర్శనను దారి పొడవునా ప్రజలు చెట్లు ఎక్కి మరీ ఆసక్తిగా తిలకించారు.

బంగారం భద్రం.. రెండు రోజుల్లో ఇచ్చేస్తా

- వడ్డీ వ్యాపారి సెల్ఫీ వీడియో



కూర్మదాసు హేమంత్‌కుమార్

కొత్తపేట: రెండు రోజుల్లో తిరిగి వస్తా.. నా షాపులో తాకట్టు పెట్టిన వస్తువులు ఎవరివి వారికి తిరిగిస్తా.. అని షాపు మూసేసి పరారైన తాకట్టు వడ్డీ వ్యాపారి కూర్మదాసు హేమంత్‌కుమార్ తెలిపాడు. ఆ మేరకు ఆదివారం సాయంత్రం ఒక సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. స్థానిక మెయిన్ రోడ్డులో సత్యసూర్య బ్యాంకర్స్ (తాకట్టు వడ్డీ వ్యాపారం) నిర్వహిస్తున్న హేమంత్‌కుమార్ గత నెల 1, 2 తేదీల్లో షాపు మూసేసి పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితులు గతనెల ఆ షాపు వద్ద ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా హేమంత్ కుమార్ సెల్ఫీ వీడియో విడుదల చేస్తూ, తాకట్టు వడ్డీ వ్యాపారంలో తనతో పాటు మరో ఇద్దరు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టగా రియల్టర్ వాసు తాను నష్టపోయానని చెప్పి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో తనతో పెట్టుబడి పెట్టిన వారు చంపుతామని బెదిరించడంతో ప్రాణభయంతో పారిపోయానని, తన వద్ద తాకట్టు పెట్టిన వస్తువులన్నీ భద్రంగా ఉన్నాయని, కరిగించలేదని పేర్కొన్నాడు. కొన్ని తన వద్ద, మరి కొన్ని తన వ్యాపార భాగస్వామి సత్యప్రియ శ్రీఘాకోళ్లపు రామకృష్ణ వద్ద, వాళ్ల నాన్న వద్ద ఉన్నాయని, పోలీసుల సహకారంతో తిరిగి వచ్చి ఎవరివి వారికి అప్పగిస్తానని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. తనకు రక్షణ కావాలని పేర్కొన్న వీడియో తాకట్టుదారులకు కొంత ఊరటనిచ్చింది.

క్షయమే లక్ష్యం

- రోగులకు ప్రత్యేక వైద్యసేవలు
- తగ్గుముఖం పడుతున్న వ్యాధి
- నేడు క్షయ నిర్మూలన దినోత్సవం



పెదపళ్లలో వైద్యారోగ్య సిబ్బందికి నిర్వహించిన క్షయవ్యాధి నివారణ అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది

అలమూరు: ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ట్యూబర్‌క్యులోసిస్ (క్షయ) వ్యాధిని నిర్మూలించేందుకు ప్రత్యేక వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. క్షయ రహిత సమాజమే లక్ష్యంగా జాతీయ వైద్యారోగ్యశాఖ క్షేత్రస్థాయిలో ఖరీదైన ఆధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలకు అనుగుణంగా ఈ వ్యాధి మరణాలను 1.7 శాతం నుంచి 0.5 శాతానికి తగ్గించే యత్నాలు జరుగుతున్నాయి. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త 1882 మార్చి 24న క్షయకు కారణమైన బాసిల్లస్ బ్యాక్టీరియాను కనుగొన్నాడు. అప్పటి నుంచి డబ్ల్యూహెచ్ఓ యేటా మార్చి 24న క్షయ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం వైద్యారోగ్య శాఖ ద్వారా రోగులను అప్రమత్తం చేస్తూ వారి ఇళ్లకు వెళ్లి ఉచితంగా మందులను అందజేస్తోంది. చికిత్సా సమయంలో సైతం పోషకాహార కిట్లతో పాటు నెలకు రూ.500 చొప్పున రోగుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 123 పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకూ నమోదైన 4632 కేసులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇవి సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు డివిజన్లుగా ఏర్పాటు చేసి ఒక్కొక్క డివిజన్ పరిధిలో ప్రత్యేక అధికారిని నియమించి వ్యాధి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

క్షయవ్యాధి గుర్తింపు- లక్షణాలు

- రెండు వారాలకు మించి దగ్గు ఉండడం.
- రాత్రి పూట ఎక్కువగా జ్వరం రావడం.
- ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం.
- ఉమ్మిలో రక్త పడటం.

తీసుకోవలసిన చర్యలు

- రెండు సార్లు కఫం (తెమడ) పరీక్షలు చేయించుకోవడం.
- దగ్గు తగ్గని రోగులు ఫ్లోరోసెంట్ మైక్రోస్కోప్ ద్వారా పరీక్షలు చేయించుకోవడం.
- వ్యాధి తీవ్రత అధికంగా ఉంటే అధునాతనమైన ఎల్‌పీఏ పరికరంతో పరీక్షలు చేయించుకోవడం.

జాగ్రత్తలు ఇలా

- పుట్టిన బిడ్డకు వెంటనే బీసీజీ టీకా వేయించాలి.
- దగ్గు వచ్చినప్పుడు నోటికి గుడ్డను అడ్డుగా పెట్టుకోవాలి.
- వ్యాధి సంక్రమించిన వ్యక్తి నిర్దేశించిన సమయం వరకూ మందులు వాడాలి.
- వ్యాధి సోకిన వ్యక్తి ఇంటిలో ఉండే కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించాలి.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



క్షయ రోగులను గుర్తించి సత్వరమే మెరుగైన చికిత్సను అందిస్తున్నాం. ప్రభుత్వం సమకూర్చిన విలువైన మందులను అందించి క్రమం తప్పకుండా ఆరోగ్య సిబ్బంది చేత పర్యవేక్షణ చేస్తున్నాం. అలాగే పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ సాయికిశోర్, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్‌సీ

● సెంటర్‌లో సై..!



తుని: మదమెక్కిన రెండు ఆంబోతులు నడిరోడ్డుపై తలపడి స్థానికులను భయపెట్టాయి. వాటి ఉగ్రతకు వాహన చోదకులు నిశ్చేష్టులయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీనివాసా సెంటర్లో పోట్లాడుకుంటున్న వీటిని చెదరగొట్టడానికి పలువురు విఫలయత్నం చేశారు. సుమారు గంట పాటు హోరాహోరీ కలహించి తరువాత శాంతించాయి.



దేవరపల్లిలో మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న అనిల్, అనుచరులు



పెట్రోలు బంకు వద్ద సుంకర దుర్గారావు, అనుచరులు

ఇద్దరూ.. ఇద్దరే..

- టీడీపీ నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం
- మద్యం దుకాణం వద్ద ఒక వర్గం ఆందోళన
- పెట్రోలు బంకు వద్ద మరో వర్గం నిరసన

దేవరపల్లి: గ్రామంలో ఇద్దరు టీడీపీ నేతల మధ్య వర్గపోరు తారస్థాయికి చేరింది. ఇద్దరు నేతల మధ్య ఆదివారం ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావుకు చెందిన మద్యం సిండికేట్ దుకాణం వద్ద క్వార్టర్ బాటిల్ మద్యానికి రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, తన అనుచరులతో ఆ దుకాణం వద్దకు చేరుకుని అమ్మకందారును నిలదీశారు. దీనిపై సీఐకి ఫోన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించలేదు. దీంతో మద్యం దుకాణానికి అనిల్ షట్టర్ వేసేసి, సీఐ వచ్చే వరకూ తీసేది లేదని ఆందోళనకు దిగారు. మండలంలోని అన్ని మద్యం దుకాణాల్లో బాటిల్‌కు అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారని, దీనిపై ఎక్సైజ్ సీఐకి గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. దీనిపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అనిల్ ఫోనులో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో అనిల్ ఆందోళన విరమించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న సుంకర దుర్గారావు తన అనుచరులతో గోపాలపురం రోడ్డులో అనిల్‌కు చెందిన ఐఓసీ పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నారు. ఆ బంకులో పెట్రోలు నాణ్యతగా ఉండటం లేదని, తక్కువ పరిమాణంలో పోసి వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై వి.సుబ్రహ్మణ్యం పెట్రోలు బంకుకు చేరుకుని ఆందోళన విరమింపజేశారు.

ఆయిల్ పామ్‌పై తెగుళ్ల దాడి

- జిల్లాలో వరి తరువాత అధికంగా సాగవుతున్న పంట
- సస్య రక్షణతో సమస్య దూరం



సీహెచ్ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి, కొవ్వూరు

పెరవలి: జిల్లాలో వరి తరువాత అధిక మొత్తంలో సాగు అవుతున్న పంట ఆయిల్‌పామ్. 19,266 హెక్టార్లలో ఈ పంట సాగు జరుగుతుండగా సంవత్సరానికి 76 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. ఈ పంటలపై వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించి ఉండటంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోందని, సత్వరం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొవ్వూరు ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. తెగుళ్లు సోకినప్పుడు రైతులు తీసుకోవాల్సిన చర్యల గురించి, ఎరువుల యాజమాన్యం గురించి ఆయన వివరించారు.



కానూరు అగ్రహారంలో తెగుళ్లు సోకి పాడైపోతున్న పామాయిల్ తోటలు (అంతర చిత్రం) కుళ్లు తెగులు సోకిన ఆయిల్ పామ్ గెలలు

కొమ్ము పురుగు

కొమ్ముపురుగు ఆయిల్‌పామ్ మొక్కలను ఆశించినప్పుడు మొక్కల ఆకులు వి ఆకారంలో కత్తిరించినట్టు ఉంటాయి. ఈ పురుగులు భూమిలో ఏర్పడిన పగుళ్లలో నివసిస్తాయి. అంతేకాకుండా చెట్టు మొదలులో ఉన్న పీచులో కూడా ఇవి చేరి పంటకు హాని చేస్తాయి. ఇవి మొవ్వలోకి కూడా ప్రవేశించి మెత్తని పదార్థాన్ని తినేస్తాయి.

నివారణ చర్యలు

మొక్కల చుట్టూ చెత్తాచెదారం లేకుండా చూడాలి. ఒకవేళ ఉంటే వాటి మీద కార్బరిల్ మందును 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొవ్వలో పురుగులు ఉన్నట్టు గుర్తిస్తే వాటిని తీగతో తీసివేసి అది చేసిన రంధ్రానికి 25 గ్రాముల కార్బరిల్ మందును 10 గ్రాముల తడి ఇసుకలో కలిపి మొవ్వలో పెట్టాలి.

సంచి పురుగు

ఈ పురుగులు శంఖు ఆకారంలో ఉండి ఆకు అడుగు భాగాన చేరతాయి. ఆకులకు రంధ్రాలు చేసి తినివేస్తాయి.

నివారణ చర్యలు

ఈ పురుగులు సోకిన ఆకులను కత్తిరించి తగులబెట్టాలి. మిగిలిన ఆకుల మీదు కార్బరిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొవ్వుకుళ్లు తెగులు

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ తెగులు సోకిన మొక్క పసుపురంగులోకి మారి మొవ్వ ఆకులను లాగితే తేలికగా వస్తాయి. మొవ్వ లాగిన మొక్క నుంచి తీవ్ర దుర్గంధం వస్తుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు సోకిన భాగాన్ని శుభ్రం చేసి లీటరు నీటికి కార్బండిజమ్ గ్రాము మందు కలిపి ఆ ప్రాంతమంతా పూయాలి.

గానోడెర్మా కుళ్లు తెగులు



ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు కింద వరుసలో ఎండిపోతాయి. తెగులు ఉధృతి అధికంగా ఉంటే మొవ్వలోకి చేరి కాండం మొదలు వద్ద కణజాలాన్ని ఆశించడంతో అక్కడ కుళ్లిపోయి చెట్టు చనిపోతుంది.

నివారణ చర్యలు

తెగులు సోకి చనిపోయిన చెట్లను వెంటనే చేను నుంచి తొలగించాలి. ఆ చెట్టు వేరును తీసి ట్రిడీమార్ఫ్ మందును 100 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి ఆ వేరు ద్వారా ఎక్కించాలి. సేంద్రియ ఎరువులను అధికంగా చెట్టు మొదలులో వేయాలి.



గెలలు వేయడం మాని పొత్తులు వేసిన చెట్టు

కాండం తడి తెగులు

ఈ తెగులు సోకిన చెట్ల మొవ్వు అకస్మాత్తుగా వడలి, ఎండిపోతుంది. మిగిలిన ఆకులు త్వరితగతిన వడలి ఎండిపోతాయి. మొవ్వ ఆకు వడలిన వెంటనే సస్యరక్షణ చర్యలు ప్రారంభిస్తే చెట్లు కోలుకుని బతుకుతాయి.

నివారణ చర్యలు

ఈ తెగులు సోకిన చెట్టు మొవ్వును లాగి అందులో కుళ్లిన పదార్థాన్ని తీసి శుభ్రం చేసిన తరువాత కార్బండిజమ్, మోనోక్రోటోఫాస్‌లను కుళ్లిన చోట పైపూతగా వేసి ఆ తరువాత తారును పూసి ఉంచాలి.

గెలకుళ్ల తెగులు

ఈ తెగులు సోకిన గెలలు కుళ్లిపోవడంతో తెల్లని శిలీంధ్రాలతో కనిపిస్తాయి. ఈ తెగులు సోకిన గెలలను వెంటనే నరికివేసి ఆ ప్రాంతంలో కుళ్లిన పదార్థాలను తీసి 0.1 శాతం కార్బండిజమ్ మందుతో శుద్ధి చేయాలి. ఇలా చేయడం వలన మిగిలిన గెలలకు ఈ తెగులు వ్యాపించకుండా ఉంటుంది.

ఎరువుల యాజమాన్యం

ఆయిల్ పామ్ మొక్కలకు సంవత్సరానికి రెండు మోతాదుల్లో ఎరువులు అందించాలి. మొదటి మోతాదు జూన్, జూలై నెలల్లోను, రెండవ మోతాదు డిసెంబర్, జనవరి నెలల్లోనే వేయాలి. మూడేళ్ల వయస్సు దాటిన ఒక్కో మొక్కకు 2 కిలోల 600 గ్రాముల యూరియా, సింగిల్‌ఫాస్ఫేట్ 3 కిలోల 750 గ్రాములు, పొటాష్ 2 కిలోలు, మెగ్నీషియం సల్ఫేట్ 500 గ్రాములు ఏడాదిలో రెండు సార్లు వేయాలి.